క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



బాపట్ల అర్బన్: స్థానిక ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నవగ్రహ, రుద్ర, లక్ష్మీ గణపతి సహితంగా చండీ సప్తశతి మంత్రోక్త చండీహోమం, పూర్ణాహుతి భక్తి శ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. స్థానిక శ్రీ లలితా త్రిపురసుందరీ పీఠం ఆధ్వర్యంలో నెమలికంటి హనుమంతరావు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో కౌండిన్యశర్మ, ప్రసాదస్వామి, నందూరి గణేష్, సురేష్ శర్మ, సాయి వెంకట్, ప్రసన్న, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది.

పోస్టల్ సర్వీసులపై అవగాహన ఉండాలి



రేపల్లె: విద్యార్థి దశ నుంచే పొదుపు, లావాదేవీలు, పోస్టల్ సర్వీసులపై అవగాహన కలిగి ఉండాలని రేపల్లె సబ్ డివిజనల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏడుకొండలు అన్నారు. డిజిటల్ ఇండియా ఫర్ లివ్ ఇండియా అనే అంశంపై తపాల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని భాష్యం పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయస్థాయి వ్యాస రచన పోటీలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో విభిన్న నైపుణ్యాలను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు తపాల శాఖ కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు తపాల శాఖ సర్వీసులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచనలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



ఇంటూరు(వేమూరు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరం లాంటిదని ఎంపీడీవో షేక్ సుభాని అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఇప్పటి వరకు నిర్వహించిన వైద్య శిబిరాల్లో 8,400 మందికి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. 1,460 మందికి కంటి పరీక్షలు, 1,012 మంది కళ్లజోళ్లు ఇచ్చి, 1500 మందిని ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రతిపాదించడం జరిగిందన్నారు. మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముగిసిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.కిరణ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన అధ్యక్షులు వీరభద్ర శ్రీనివాస్ రెడ్డి, బోట్టు మోషే తదితరులు పాల్గొన్నారు.

మహిళా వలంటీర్‌పై భర్తదాడి

కేసు నమోదుచేసిన పట్టణ పోలీసులు

బాపట్లటౌన్: పట్టణంలోని పేద ప్రజలకు పలు సంక్షేమ పథకాలను అందిస్తూ విధులు నిర్వర్తిస్తున్న మహిళా వలంటీర్‌పై మరణాయుధాలతో భర్త దాడి చేసిన ఘటన పట్టణంలోని 31 వార్డు, చెంగ్రాయుడుతోటలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని చెంగ్రాయుడుతోటకు చెందిన బిల్లా గ్లోరి వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె భర్త బిల్లా శ్యామ్యూల్ మద్యానికి బానియ్యాడు. మద్యం మత్తులో గురువారం రాత్రి ఆమెను వెనుక నుంచి మారణాయుదాలతో దాడి చేశారు. ఈ దాడిలో క్షతగాత్రురాలికి మెడ, కుడిచేయి మణికట్టు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంటు ప్రారంభం



తెనాలి: పట్టణానికి చెందిన జీఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంటు శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక జయప్రకాష్ నగర్‌లోని ప్రైవేటు మైదానంలో మూడు రోజులు జరిగే టోర్నమెంటును స్థానిక 1, 39 వార్డుల కౌన్సిలర్లు గెడ్డేటి సురేంద్ర, ఝాన్సీవాణి ప్రారంభించారు. తొలిరోజు మోరంపూడి–ఈమని జట్ల మధ్య జరిగిన పోటీల్లో ఈమని జట్టు విజయం సాధించింది. మరో పోటీలో మధు టీమ్ గెలుపొందింది. ఈ కార్యక్రమంలో చావలి మురళీకృష్ణ, నాలాది ప్రభాకర్, దాసరి రమేష్, మట్లపూడి రాజేశ్వరరావు, అమర్తలూరి ప్రకాష్, అత్తోట అమృతరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- వేగంగా విద్యుత్ లేన్ల ఆధునీకరణ
- రేపల్లె, వెల్లటూరులో నూతన సబ్ స్టేషన్‌లకు నిధులు మంజూరు
- విద్యుత్ శాఖ తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి

రేపల్లె రూరల్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించటంతో పాటు విద్యుత్ సరఫరాలో హై, లో వోల్టేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ డివిజన్ పరిధిలో రెండు చోట్ల సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయని విద్యుత్‌శాఖ తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి అన్నారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని రేపల్లె పట్టణం, వెల్లటూరు గ్రామాలలో రూ.8కోట్లతో సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయన్నారు. టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు ఈఈ తెలిపారు. వినియోగదారుల అభ్యర్థన మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ లేన్ల ఆధునీకరణ..

గత 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను, తీగలను తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని అమరుస్తున్నామని ఈఈ చిరంజీవి తెలిపారు. గత సంవత్సర పాలన కాలంలో రేపల్లె పట్టణంలో రూ.2.8కోట్ల వ్యయంతో 43 ట్రాన్స్‌ఫార్మర్‌లు, 70 విద్యుత్ స్తంభాలు, 4 కిలోమీటర్ల మేరకు నూతన వైర్లను ఏర్పాటు చేయగా రేపల్లె రూరల్ మండలంలో రూ.1.8కోట్ల వ్యయంతో 23 ట్రాన్స్‌ఫార్మర్‌లు, 210 విద్యుత్ స్తంభాలు, 5 కిలోమీటర్ల మేరకు నూతన వైర్లను ఏర్పాటు చేశామన్నారు. భట్టిప్రోలు మండలంలో రూ.1.9కోట్ల వ్యయంతో 25 ట్రాన్స్ ఫార్మర్‌లు, 150 విద్యుత్ స్తంభాలతో పాటు అవసరమైన ప్రాంతాలలో విద్యుత్ వైర్లను అమర్చామన్నారు. తీర ప్రాంతంలో విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తమ యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందన్నారు. అధికారులకు విద్యుత్ వినియోగదారులు సహకరించి సంస్థ అభివృద్ధికి చేయూతనివ్వాలని ఆయన కోరారు. విద్యుత్ బిల్లులు పొందిన 15 రోజుల లోపు విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించాలన్నారు.

రేపల్లె సబ్ డివిజన్‌లో 54వేల కనెక్షన్‌లు..

రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని 3 మండలాలలో మొత్తం 54వేల విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయని ఈఈ చిరంజీవి తెలిపారు. వీటిలో 3వేలు వ్యవసాయ కనెక్షన్‌లు, 900 ఆక్వా కనెక్షన్‌లు, మిగిలినవి గృహ వినియోగం, కమర్షియల్ ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి 9 గంటల పాటు విద్యుత్ సరఫరాను అందిస్తున్నామన్నారు. అయితే డివిజన్ పరిధిలోని ఆక్వా జోన్ పరిధిలో లేని 100 కనెక్షన్‌లకు గత ఏడాది రూ.71లక్షల ఫెనాల్టీలు విధించామన్నారు. అయితే తాము ఆక్వా జోన్ రైతులమని, ఫెనాల్టీలను తొలగించి సబ్సిడీ వర్తింపజేయాలని రైతుల అభ్యర్థనను ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటంతో.. ప్రభుత్వం ఆ మొత్తాన్ని మాఫీ చేసిందన్నారు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. సమావేశంలో డీఈ భాస్కరరావు, పట్టణశాఖ ఏఈ పి.ఏడుకొండలు, సిబ్బంది ఉన్నారు.

సమగ్రంగా మొదటి విడత రీ–సర్వే పూర్తిచేయాలి

జిల్లా సర్వే అధికారి ఎ.పవన్‌కుమార్



భూముల రీ సర్వే పనులపై సమీక్షిస్తున్న జిల్లా సర్వే అధికారి పవన్‌కుమార్

భట్టిప్రోలు: మండలంలో తొలి విడతగా జరుగుతున్న భూముల రీ సర్వే పనులపై శుక్రవారం జిల్లా సర్వే అధికారి ఎ. పవన్‌కుమార్ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దారు కార్యాలయంలో మాట్లాడుతూ రీ సర్వే చేసే సమయంలో సిబ్బంది ఎలాంటి ఒడిదుడుకులకు లోనుకాకుండా పూర్తిస్థాయిలో సమగ్రంగా సర్వే నిర్వహించాలన్నారు. రైతుల నుంచి సంబంధిత భూముల పత్రాలను సేకరించి వాటి ద్వారా నమోదు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. తొలి విడత గ్రామాల్లో త్వరితగతిన రీ సర్వే చేస్తే మిగిలిన గ్రామాల్లో కూడా ఈ సర్వే చేపట్టేందుకు అవకాశం లభిస్తుందన్నారు. సర్వే సిబ్బంది చేస్తున్న పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తహసీల్దారు డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తొలి విడతగా గొరిగపూడి, కోనేటిపురం, భట్టిప్రోలు, పల్లెకోన, ఓలేరు గ్రామాలను ఎంపిక చేయగా ఇప్పటి వరకు గొరిగపూడి రెవెన్యూ పరిధిలో పూర్తిస్థాయి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో కోనేటిపురం రెవెన్యూ కూడా పూర్తి చేసి, నివేదికలు రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డీఐఓఎస్ టి. శ్రీనివాసులు, మండల సర్వేయర్ ఎం. శ్రీనివాసరావు, సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ

కర్లపాలెం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత గ్రామ వలంటీర్లపై ఉంటుందని ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు అన్నారు. గ్రామ వలంటీర్ల నియామకాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ, తహసీల్దారు కేశవనారాయణరావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎలీషాబాబు మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు మొత్తం 9 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. పెదగొల్లపాలెంలో రెండు వలంటీర్ల పోస్టులకు ముగ్గురు, కొత్తనందాయపాలెంలో ఒక వలంటీర్ పోస్టు కోసం ఇద్దరు, అలాగే పాతనందాయపాలెం, సమ్మెటవారిపాలెం బుద్దాం, గణపవరం గ్రామాలలో ఒక్కొక్క వలంటీర్ నియామకానికి ఒక్కొక్కరు హాజరయ్యారని తెలిపారు. పేరలి గ్రామంలో ఒక వలంటీర్ పోస్టు కాళీగా ఉండగా ఒక అభ్యర్థి దరఖాస్తు చేసినప్పటికీ అతను ఇంటర్వ్యూకు హాజరు కాలేదని తెలిపారు. దుండివారిపాలెం పంచాయతీలో ఒక వలంటీర్ పోస్టు కాళీగా ఉన్నప్పటికీ ఎవరూ దరఖాస్తు చేయలేదని ఈవోపీఆర్డీ వివరించారు.

చెరుకుపల్లి: మండలలోని కనగాల, ఆళ్లవారిపాలెం పంచాయతీల పరిధిలో ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ల పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సందర్భంగా ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు వలంటీర్ పోస్టులకు నలుగురు అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూకు ముగ్గురు హాజరయ్యారని తెలిపారు. ఎంపికైన వారికి త్వరలో నియామక పత్రాలు అందిస్తామన్నారు. తహసీల్దారు కె.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ జి.మురళీకృష్ణ, అభ్యర్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు విధులు సక్రమంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఐలవరం(భట్టిప్రోలు): అంగన్‌వాడీ కార్యకర్తలు విధిగా నియమ నిబంధనలు పాటించాలని అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఐలవరం గ్రామంలో శుక్రవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు విధిగా రికార్డులు నమోదు చేసి చిన్నారుల హాజరు శాతం, బరువు నమోదు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారాన్ని గర్భిణిలకు, చిన్నారులకు అందించాలన్నారు. ప్రీ స్కూల్ చిన్నారులకు వివిధ అంశాలపై ఆట పాటలతో కూడిన విద్యను బోధించాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఏసీడీపీవో అరుణ కుమారి, సెక్టార్ సూపర్‌వైజర్లు బేబి స్వర్ణలత, రమణ పాల్గొన్నారు.

భవనం పైనుంచి దూకి యువతి ఆత్మహత్య



తప్పెట శృతి (ఫైల్)

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలో పని చేసే యువతి ఆరు అంతస్తుల భవనం మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... నగర పాలక సంస్థ పరిధిలోని గుడిమెడలో నివాసముండే తప్పెట అరుణ్‌కుమార్, దుర్గ దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో వారి కుమార్తె శృతి (19) యూనివర్సిటీలోని ఓ క్యాంటీన్‌లో హౌస్‌కీపర్‌గా పనిచేస్తోంది. గురువారం సాయంత్రం క్యాంటీన్ మూసివేసిన అనంతరం తన స్నేహితురాలైన పావనితో కలసి ఇంటికి వెళ్లింది. ఈ సమయంలో పావని యూనివర్సిటీలోని ఆర్ అండ్ డీ డిపార్ట్‌మెంట్‌లో ఆగింది. పావని పని ముగించుకుని శృతి కోసం బయట చూడగా ఆమె జాడ కనిపించలేదు. పావని ఇంటికి వెళ్లిపోయింది. శృతి గురించి ఆమె తల్లిదండ్రులు గురువారం రాత్రి పావనిని విచారించారు. నా కన్నా ముందే వచ్చేసిందని చెప్పింది. తెల్లవారుజామున శ్రీకాంత్ అనే వ్యక్తి ఆర్ అండ్ డీ బిల్డింగ్ వెనుక శృతి కిందపడి ఉండడం చూసి యూనివర్సిటీ యాజమాన్యానికి సమాచారం అందించాడు. వెంటనే ఆమెను కాలేజీ అంబులెన్స్‌లో తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు శృతి తల్లిదండ్రులతో కలసి యూనివర్సిటీకి వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. శృతి ఆత్మహత్య సమయంలో సెల్‌ఫోన్ పూర్తిగా ధ్వంసమైంది. ఆర్థిక బాధలు తట్టుకోలేక తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మాత్రం పగిలిపోయిన సెల్‌ఫోన్‌లో సమాచారాన్ని పూర్తిగా పరిశీలించి పోస్ట్ మార్టం నివేదిక వచ్చిన తరువాత శృతి మృతికి గల కారణాలు వెల్లడిస్తామని తెలిపారు.

గోల్డ్ స్కీం పేరిట మోసం

తెనాలిరూరల్: స్కీములో చేరి నెల నెలా డబ్బు చెల్లిస్తే బంగారం ఇస్తామని చెప్పి మోసం చేయడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నందుల పేటకు చెందిన గోల్డ్ వర్కర్ జొన్నాదుల చిరంజీవి తనకు తెలిసిన వారి ద్వారా పట్టణానికే చెందిన ఇద్దరి వద్ద గోల్డ్ స్కీములో చేరారు. పలు దఫాలుగా రూ.15.66 లక్షలు వారికి చెల్లించాడు. రోజులు గడుస్తున్నా బంగారం ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించిన చిరంజీవి పోలీసులను ఆశ్రయించాడు. వన్ టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో వలంటీర్‌గా చేసేందుకు ముందుకు రండి..

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో వలంటీర్‌గా చేరి ఆసుపత్రి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ కోరారు. సామాజిక బాధ్యత కలిగిన స్వచ్ఛంద సేవా సంస్థలు, యువజన సంఘాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు జీజీహెచ్‌లో వలంటీర్లుగా పని చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం జీజీహెచ్ ఓపీ విభాగం వద్ద రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వలంటీర్ల సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష చేశారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నవంబర్ ఒకటి నుంచి బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. వలంటీర్ల వ్యవస్థ నిర్వహణకు నోడల్ ఆఫీసర్‌గా ఒకరిని నియమిస్తామన్నారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో శ్రీ సత్య సాయి సేవ సమితి సేవలు అందిస్తోందని వివరించారు. వలంటీర్లుగా వచ్చేవారు తమ పేర్లను నోడల్ అధికారికి ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ వెంకట రమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ సమీనా బేగం, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

రవి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు జీజీహెచ్ శుశ్రుత హాలులో దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న పలువురు చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎ.కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీబాలాజీ హాస్పటల్ అధినేత, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ బిజాపూరి చంద్రశేఖర్, డాక్టర్ లక్ష్మీగౌరి దంపతుల పుట్టిన రోజు సందర్భంగా ఉచితంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తమలపాకుల ప్రభాకరరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు మేనేజర్ లంకపల్లి మధుసూధనరావు, ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ పాల్గొన్నారు.

స్టేజ్ స్పీకర్ పోడియం బహూకరణ



భట్టిప్రోలు: స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయానికి తెనాలి, విజయవాడకు చెందిన ఎంఎస్‌రావు అండ్ అసోసియేట్స్ నిర్వాహకులు రూ.35 వేలు విలువ చేసే.. స్టేజ్ స్పీకర్ పోడియంను బహూకరించారు. శుక్రవారం ఈ పోడియంను దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబాకు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి సరోజని, సీహెచ్ మోహన్ రావు, ఎస్.సాంబశివరావు, దేవస్థాన, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా భాస్కరరావు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) పీవీకే భాస్కరరావును నియమిస్తూ మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి, నవంబర్ 5వ తేదీ వరకు స్వీడన్, ఆస్ట్రేలి యా దేశాల్లో జరిగే అంతర్జాతీయ సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్లనున్నారు. ఆమె స్థానంలో ఎస్ఈ భాస్కరరావు ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించనున్నారు.

త్రోబాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

పెదకాకాని: విద్యార్థులు క్రీడా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 నియోజకవర్గాలకు చెందిన బాల బాలికల జట్లకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరచిన వారిని అండర్- 14 జిల్లా బాలుర జట్టుకు, బాలికల జట్టుకు ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలలో పాల్గొంటారని వ్యాయామోపాధ్యాయుడు అశోక్ తెలిపారు. ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీఎం శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

బేల్దారు కార్మికుడిపై దాడి

గుంటూరు ఈస్ట్: బేల్దారు కార్మికుడిపై వాచ్‌మెన్ దాడిచేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట 1వ లైనులో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద షేక్ సుభాని బేల్దారు పనులు చేస్తున్నాడు. వాచ్‌మెన్ వెంకట్ సుభానితో గొడవపడి దాడిచేసి, గాయపరిచాడు. శుక్రవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



సత్యవాణికి మెమెంటో బహూకరిస్తున్న రాఘవేంద్రరావు, డాక్టర్ అన్నదానం

బాపట్ల అర్బన్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల స్థాయిలో చిలకలూరిపేట రోటరీ క్లబ్ రొటేరియన్ తియ్యగూర కోటిరెడ్డి స్మారకార్థం నిర్వహించిన తెలుగు వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలలో మాతృశ్రీ ఓరియంటల్ కాలేజ్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. తెలుగు భాష భవితవ్యం అనే అంశంపై నిర్వహించిన తెలుగు వ్యాసరచన పోటీలో విద్యార్థిని బి.సత్యవాణి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఆధునిక భారత నిర్మాణంలో మహిళా బిల్లు ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో బీఏఓఎల్ మూడవ సంవత్సరం విద్యార్థిని చందాన రమ ప్రథమ బహుమతి పొందింది. క్విజ్ విభాగంలో విద్యార్థులు బి.సత్యవాణి, బి. ప్రత్యూష ప్రత్యేక బహుమతులు పొందారు. తెలుగు అధ్యాపకులు బీవీకే శక్తిధర్, మనీషా విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారు. విజేతలను కళాశాల యాజమాన్యం, కరస్పాండెంట్ గోగినేని రాఘవేంద్రరావు, ప్రిన్సిపల్ డాక్టర్ అన్నదానం ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ లక్కవరపు మృదుల, వివిధ విభాగ అధిపతులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

3 నుంచి స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ దేవరాజు

భట్టిప్రోలు: స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే నవంబరు 3 నుంచి నిర్వహించనున్నట్లు ఎంఈవో ఎస్.దేవరాజు తెలిపారు. మండల విద్యా వనరుల కేంద్రంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం ఏఈఏఎస్ అండ్ ఎన్ఏఎస్ పై శిక్షణ ఇచ్చారు. ఎంఈవో దేవరాజు మాట్లాడుతూ ఎంపిక చేయబడిన ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తరగతుల విద్యార్థులకు సిలబస్ నుంచి గణితం, లాంగ్వేజ్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలు ఇంగ్లీష్, తెలుగు మీడియంలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు డిగ్రీ స్థాయి, డీఎడ్, ఇంజినీరింగ్ కోర్సులు చదువుచున్న విద్యార్థులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా నియమించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు, పెదపులివర్రు, ఐలవరం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, షేక్ మహ్మద్ సుభాని, మాచర్ల మోహన్‌రావు ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

వెల్లటూరులో క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో మాట్లాడుతున్న వైద్యురాలు సౌమ్య

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు ఆర్సీఎం చర్చి ఆవరణలో శుక్రవారం క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని విచారణ గురువు మార్టిన్ ప్రారంభించారు. అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్, గుంటూరు డియోసిస్ సోషల్ సర్వీస్ అండ్ వెల్‌ఫేర్ సొసైటీ(జీడీఎస్ఎస్ డబ్ల్యూఎస్), జ్యోతి హెల్త్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జీడీఎస్ఎస్ డబ్ల్యూఎస్ డైరెక్టర్ గోవింద రాజన్న పర్యవేక్షించారు. క్యాన్సర్ స్పెషలిస్ట్ వైద్యులు సౌమ్య, జ్యోతి, హెల్త్ సెంటర్ వైద్యులు ఎస్‌జీకే మూర్తి వైద్య పరీక్షలు నిర్వహించారు. జీడీఎస్ఎస్ డబ్ల్యూఎస్ నిర్వాహకులు క్యాన్సర్‌తో బాధపడుతున్న పది మందికి రూ.2 వేలు చొప్పున రూ. 20 వేలు నగదును అందజేశారు. జ్యోతి హెల్త్ సెంటర్ సుపీరియర్ సిస్టర్ సహాయ రెజి రూ. 20 వేలు విలువ చేసే మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జీడీఎస్ఎస్ డబ్ల్యూఎస్ కో–ఆర్డినేటర్ ఎస్కే సూరిబాబు, ఎస్కే బాబ్జి, ఎస్. జ్ఞాన సుందర్, స్థానిక కో–ఆర్డినేటర్ పచ్చిగళ్ల వెంకట రత్నం, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో ఈ–పంట నమోదు జాబితా ప్రదర్శన



పొన్నపల్లిలో ఈ–పంట నమోదు జాబితాను రైతులకు వివరిస్తున్న ఏవో



ఏట్రవారిపాలెం ఆర్బీకేలో జాబితాను విడుదల చేసిన ఏవో సుమంత్‌కుమార్

చెరుకుపల్లి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఈ–పంటలో నమోదు చేసుకున్న రైతుల జాబితా రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శనకు ఉంచినట్లు మండల వ్యవసాయధికారి టి.బాలాజీ గంగాధర్ అన్నారు. పొన్నపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఈ–పంట నమోదు జాబితాను శుక్రవారం ఆయన పరిశీలించారు. మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో ఈ–పంట నమోదు జాబితాను ఏర్పాటు చేశామన్నారు. ఈ జాబితాపై ఎటువంటి అభ్యంతరాలున్నా.. రైతు పేరు, తండ్రి పేరు, పంట రకం, విస్తీర్ణం తదితర వివరాలు సరిచూసుకుని ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే ఈ నెల 29లోపు గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియపరిచి, పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: ఈ–క్రాప్ జాబితాలో తమ వివరాలను రైతులు పరిశీలించుకోవాలని భట్టిప్రోలు సర్పంచ్ దారా రవికిరణ్మయి అన్నారు. భట్టిప్రోలు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఈ క్రాప్ నమోదు జాబితాను ఆమె విడుదల చేశారు. జాబితాలో పేర్లు లేనట్లయితే మూడు రోజుల్లోగా ఆయా రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏల ద్వారా రైతులు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి జి. మీరయ్య, వేమూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొతరపు శ్రీనివాసరావు, వీఏఏ మైత్రేయి, నాయకులు దారా చెన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు సామాజిక తనిఖీ

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు రైతు భరోసా కేంద్రంలో ఈ–పంట నమోదుకు సంబంధించి శుక్రవారం గ్రామ సభ, సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖాధికారి జి. మీరయ్య మాట్లాడుతూ ముసాయిదా జాబితాలోని పంట సాగు, అర్హుల వివరాలు సరి చూసుకుని మార్పులు ఉంటే.. ఆర్బీకేలలో ఈ నెల 30వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఎంపీటీసీ దారావత్ కుమారిభాయ్, పంచాయతీ కార్యదర్శి రామ్‌కుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గురిందపల్లి సునీల్ కుమార్, సభ్యులు చందోలు రవికుమార్, వీహెచ్ఏ హిమబిందు, రైతులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ ముసాయిదా జాబితా విడుదల

కర్లపాలెం: ఈ–క్రాప్‌లో పంట నమోదు చేసుకున్న రైతుల ముసాయిదా జాబితాను రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శనకు ఉంచినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి సుమంత్‌కుమార్ తెలిపారు. ఏట్రవారిపాలెం ఆర్బీకేలో జాబితాను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఆయా గ్రామాలకు సంబంధించిన రైతు భరోసా కేంద్రాల వద్ద ముసాయిదా జాబితాను ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు. రైతులు జాబితాను పరిశీలించుకుని తమ పేర్లు లేకపోతే రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని కోరారు. సవరణల అనంతరం పంట నమోదు రైతుల వివరాలను నవంబర్ 1న ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డి.పద్మావతి, వీఆర్వో సాంబయ్య, గ్రామ వ్యవసాయ సహాయకుడు ధ్రువకుమార్ తదితరులు ఉన్నారు.